


## టీటీడీకి ఆటో విరాళం

**ప్రజాశక్తి- తిరుమల:** తిరుమల శ్రీవారికి సోమవారం నెల్లూరుకు చెందిన విజన్ ఆటో మొబైల్స్ మేనేజింగ్ పార్టనర్ పూర్ణచంద్ రూ.3.06లక్షల విలువైన అపే క్లాసిక్ 435సిసి (డిజిల్) ఆటోను అందజేశారు. శ్రీవారి ఆలయం ఎదుట జరిగిన కార్యక్రమంలో దాత ఈమేరకు ఆటో తాళాలను శ్రీవారి ఆలయ డెప్యూటీ ఈవో రమేష్‌బాబుకు అందజేశారు. కార్యక్రమంలో తిరుమల టీటీడీ ట్రాన్స్‌పోర్టు డిఐ జానకిరామి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాలో ఆగని వానలు

- తిరుపతిలో ముసురు వర్షాలు
- పొంగుతున్న వాగులు.. వంకలు
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- లోతట్టు ప్రాంతాలు జలమయం

**ప్రజాశక్తి- తిరుపతిటౌన్**

తిరుపతి జిల్లాలో గత నాలుగు రోజులు ముసురు వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల వల్ల జిల్లాలోని పలు రోడ్లు జలమయ్యాయి తిరుపతికి దాహర్తి అందిస్తున్న కళ్యాణి డ్యాంలో భారీగా నీరు వచ్చి చేరింది. దీంతో మరో రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో డ్యాం నుండి అవకాశం ఉందని ఇరిగేషన్ శాఖ అధికారులు పేర్కొన్నారు. తిరుపతి జిల్లాల్లోని కోట మండలంలో అత్యంధికంగా 131.2 మిల్లీమీటర్ల వర్షపాతం, ఎర్రవారిపాలెం మండలంలో 1.0 మిల్లీమీటర్లు నమోదైంది.

అలాగే వాకాడు మండలంలో 86.8 మి.మీ, ఓజిలి 81.0 మి.మీ, చిల్లకూరు 75.4 మి.మీ, చిట్టమూరు 75.4 మి.మీ, గూడూరు 60.2 మి.మీ, నాయుడుపేట 56.6 మి.మీ, దొరవారిసత్రం 46.4 మి.మీ, పెళ్లకూరు 46.0 మి.మీ, వెంకటగిరి 42.2 మి.మీ, బాలయ్యపల్లి 38.6 మి.మీ, వరదయ్యపాలెం 38.2 మి.మీ, సూళ్లూరుపేట 34.2 మి.మీ, తడ 32.4 మి.మీ, డక్కలి 31.6 మి.మీ, తొట్టంబేడు 30.0 మి.మీ, శ్రీకాళహస్తి 25.4 మి.మీ, బిఎన్‌కండ్రిగ 20.8మి.మీ, నారాయణవనం 12.2మి.మీ, పుత్తూరు 12.0మి.మీ, నాగలాపురం 10.0మి.మీ, కేవీబీపురం 9.8 మి.మీ, ఏర్పేడు 9.2మి.మీ, వడమాలపేట 7.0మి.మీ, సత్యవేడు 6.6మి.మీ, పాకాల 5.2మి.మీ, రేణిగుంట 4.0మి.మీ, తిరుపతి అర్బన్ 2.8మి.మీ, పిచ్చాటూరు 2.6మి.మీ, తిరుపతిరూరల్ 2.2మి.మీ, చంద్రగిరి 1.8మి.మీ, రామచంద్రపురం1.6మి.మీ వర్షపాతం నమోదైంది.



కైవల్యానది బ్రిడ్జిపై పొంగి పొర్లుతున్న నీరు

### పొంగుతున్న వాగులు.. వంకలు

**బాలాయపల్లి:** భారీ వర్షాల కారణంగా మండలంలోని నేరేడు కాలువ, కైవల్యానది పొంగి పొర్లుతోంది. కాలువ నిండి నిండలివాక్యం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉంది. అలాగే మండలంలోని సీసీకండ్రిగతోపాటు పలు గ్రామాల మధ్య రాకపోకలు అంతరాయం కలుగనుంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వెంకటరెడ్డిపల్లి సమీపంలోని గిరిజనకాలనీలో ఇళ్లు ఉరుస్తున్నా అధికారులు పట్టింకోవడం లేదు. వీధుల్లో నీళ్లు నిలిచి అవస్థలు పడుతున్నారు. పచ్చారుచేను, బాలాయపల్లి గ్రామాల గిరిజనుల ఇళ్ల వద్ద నీరు నిలిచిపోతున్నాయి. బిక్కు బిక్కుమంటున్న గిరిజనులను అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

### ఉప్పుటేరు వాగును పరిశీలించిన ఆర్డీవో కిరణ్‌కుమార్

**గూడూరు రూరల్:** చిల్లకూరు మండలం తిప్పాగుంటపాళెం వద్ద ఉప్పుటేరువాగు పారుతుండటంతో అప్రమత్తమైన గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ సోమవారం పరిశీలించారు. ముందస్తు జాగ్రత్తగా ఓ కమిటీని నియమించి రోప్ సహాయంతో వాగును ఎలా దాటాలో అగ్నిమాపక సిబ్బంది ట్రయిల్ నిర్వహించారు. విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు డివిజనల్, మండల స్థాయి సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. చిల్లకూరు తహసీల్దారు స్వర్ణలత, ఎంపీడీవో విష్ణు, చిరంజీవి, సీఐ దశరథరామయ్య, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

### వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**గూడూరు రూరల్:** భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. వర్షాలకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు సోమవారం అధికారులను ఆదేశించారు. పట్టణ సమీపంలోని చల్ల కాలువ వద్ద వరద నీటిని ఎమ్మెల్యేతోపాటు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ దేవసేనమ్మ, మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ కలిసి పరిశీలించారు. సమీపంలోని నివాసాల్లోకి నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రెండో పట్టణ సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై పవన్, వైసీపీ నాయకులు జమిల్లమ్మ, అజీజ్ ఖాన్, బిక్కు సాహెబ్, అల్తాఫ్‌బాయి, లక్ష్మీ, పెంచలయ్య పాల్గొన్నారు.

# ఎన్ఐఇఎల్ఐటి ఏర్పాటుకు స్థలపరిశీలన

## ఎంపీ గురుమూర్తితో కలిసి స్థలపరిశీలన చేసిన ఎన్ఐఇఎల్ఐటి ప్రతినిధులు



కేంద్ర బృందంతో కలిసి ఎస్వీయూలోని న్యాచురల్ సైన్స్-2 భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపి గురుమూర్తి

**ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో :** ఢిల్లీ ప్రధాన కేంద్రంగా ఉన్న నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్ఐఇఎల్ఐటి) దక్షిణ భారతదేశంలో కేవలం కేరళలోని క్యాలికట్లో, తమిళనాడులోని చెన్నైకే పరిమితమైన అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన విద్యాసంస్థ తిరుపతిలో ఏర్పాటు చేసేందుకు ఎంపీ మద్దెల గురుమూర్తి, ఎన్ఐఇఎల్ఐటి కమిటీ ఛైర్మన్ కమ్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ కష్ణమూర్తి, అడిషనల్ డైరక్టర్ రజనీష్ కుమార్ అస్తాన కలిసి స్థల పరిశీలన చేశారు. మొదటగా శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీలోని న్యాచురల్ సైన్స్-2 భవనాన్ని పరిశీలించారు. అనంతరం పద్మావతి మహిళా యూనివర్సిటీని సందర్శించి, ఐఐడిటి భవనాన్ని కూడా పరిశీలించారు. పరిశీలన తరువాత కమిటీ ఛైర్మన్ మాట్లాడుతూ తమ నివేదికను ఎన్ఐఇఎల్ఐటి ఛైర్మన్‌కి పంపుతామని ఎక్కడ నిర్మించాలో నిర్ణయం తీసుకొన్న తరువాత ప్రకటిస్తామన్నారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ ఎన్ఐఇఎల్ఐటి తిరుపతిలో నెలకొల్పడం ద్వారా వత్తి విద్య కోర్సులతోపాటు మారుతున్న టెక్నాలజీరంగంలో ఉద్యోగావకాశాల కోసం అందుకు అవసరమైన కోర్సులు నేర్చుకోనేందుకు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి ప్రధాన నగరాలకు వెళ్ళవలసిన అవసరం లేకుండా తగిన నైపుణ్యాన్ని ఈ విశ్వవిద్యాలయం అందిస్తుందని చెప్పారు. విజయవంతంగా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకి వారివారి అర్హతలను బట్టి అవకాశాలను కూడా కల్పిస్తుందని తైవాన్, జపాన్, చైనా, కొరియా వంటి దేశాలతో అవగాహన ఒప్పందం కలిగి ఉన్నందువలన విదేశాలలో కూడా ఉద్యోగావకాశాలు కల్పిస్తుందని తెలిపారు. ఎపెడ సీఈఓ కిరణ్ కుమార్ రెడ్డి, ఎస్వీ యూనివర్సిటీ విసి.రాజారెడ్డి, మహిళా యూనివర్సిటీ రిజిస్ట్రార్ మమత, రిజిస్టార్ హుస్సేన్, ఐటీ ఇన్వెస్టర్స్ స్పెషలిస్ట్ చెవిరెడ్డి హేమచంద్ర, ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, రూసా సీఈఓ వంశీ, సీమెన్స్ ఇంఛార్జి దివాకర్‌రెడ్డి, డీన్ ఐటీ దామోదర్‌రెడ్డి, ఈసీ మెంబర్ మధు పాల్గొన్నారు.



ఎస్వీయూ మీటింగ్ హాల్‌లో కేంద్ర బృందంతో మాట్లాడుతున్న ఎంపి గురుమూర్తి

## చక్కెర వ్యాధిపై అవగాహన అవసరం




**ప్రజాశక్తి- తిరుపతి సిటీ:** తిరుపతి నగరంలోని ఆర్‌సి.రోడ్డు లోని కార్మిక రాజ్య బీమా (ఈఎస్ఐ) ఆసుపత్రిలో వరల్డ్ డయాబెటిస్ దినోత్సవంను పురస్కరించుకొని సోమవారం చక్కెరవ్యాధిపై రోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చక్కెరవ్యాధి రాకుండా ముందుగా తీసుకోవలసిన జాగ్రత్తలు, వస్తే పాటించాల్సిన ఆహారపు నియమాలు, ప్రతిరోజూ చేయాల్సిన వ్యాయామం, గర్భిణీ స్త్రీలు గర్భం ధరించక ముందు నుండి తీసుకోవాల్సిన జాగ్రతలు, పిల్లలకు ఈ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆసుపత్రి స్పెషలిస్ట్ డాక్టర్లు వివరించారు. ప్రపంచంలో రోజుకు,రోజుకు చక్కెర వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారని, ప్రతిఒక్కరూ ఈ డయాబెటీస్ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలన్నారు. చక్కని ఆహారం, ప్రతిరోజూ తప్పనిసరిగా వ్యాయామం, నడక లాంటివి చేయాలని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.శ్రీధర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.శ్రీధర్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ ఎ.వెంకట సత్యప్రసాద్, సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ డాక్టర్లు రమేష్ కుమార్, కె.పద్మావతి, సి.శ్రీనివాసులు, కె.రామక్రిష్ణ, నర్సింగ్ సూపరింటెండెంట్ సి.అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రీయ విజ్ఞానంతోనే సైన్స్ అభివృద్ధికి బాటలు

### ఎస్వీయూ పరిశోధనా సంచాలకులు ఆచార్య ఎస్. విజయభాస్కరరావు





**ప్రజాశక్తి - క్యాంపస్:** శాస్త్రీయ విజ్ఞానంతోనే సైన్స్ అభివృద్ధికి బాటలు వేయవచ్చునని ఎస్వీయూ పరిశోధనా సంచాలకులు ఆచార్య ఎస్.విజయభాస్కరరావు పేర్కొన్నారు. తిరుపతిలోని ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం సైన్స్ ప్రదర్శనశాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు మెడల్స్‌తో సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొనడం అభినందనీయమన్నారు. విద్యార్థులు పుస్తకాల్లోని పరిజ్ఞానాన్ని, సైన్స్ పరిజ్ఞానాన్ని మెడల్స్ రూపంలో తయారు చేయడం వారి వినూత్న ఆలోచనలకు నిదర్శనమన్నారు. విద్యార్థులు అందర్నీ ఒక చోటికి చేర్చి సైన్స్ పరిశోధనలు, మోడల్స్ అందరికీ చూసే విధంగా ఏర్పాటు చేయడం పట్ల ఇతర విద్యార్థుల్లో కూడా శాస్త్రీయ దక్పథం, సైన్స్ పట్ల ఆసక్తి పెరుగుతాయన్నారు. ఇటువంటి సైన్స్ ఫెయిర్లు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లోని సజనాత్మకత వెలుగులోకి వస్తుందన్నారు. అంతేకాకుండా విద్యార్థుల్లో శాస్త్రీయ దక్పథం పెరిగి, ఆలోచన దక్పథంలో మార్పు వచ్చి సైన్స్‌రంగంలో వినూత్న ఆవిష్కరణలకు నాంది పలుకుతాయన్నారు. బాలోత్సవ్ కోశాధికారి పి.గురునాథం మాట్లాడుతూ పాఠశాల తరగతులలో చదివే విద్యార్థులకు విశేషమైన సైన్స్ పరిజ్ఞానం ఉండడం ద్వారా దానిని వెలికిలేకి తీసేందుకు ఇటువంటి సైన్సు ప్రదర్శనలు ఎంతో ముఖ్యమైనవని వెల్లడించారు. విద్యార్థులకు సైన్స్ రంగం పట్ల ఆసక్తిని కలిగించేందుకు ఇవి ఎంతో కృషి చేస్తాయన్నారు. ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ మాట్లాడుతూ విద్యార్థులకు సంబంధించి ఎన్నో అంశాలు ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. విద్యార్థులు ఎప్పుడైనా గాని ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలోని అంశాలలో పరిజ్ఞానం పెంపొందించుకొని మోడల్స్ ను తయారు చేసేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో బాలోత్సవ్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం. నాగార్జున, జిల్లా సైన్స్ అధికారి భాను ప్రకాష్, సభ్యులు, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## డిసెంబర్ నెల వర్చువల్ సేవా టికెట్ల కోటా విడుదల

**ప్రజాశక్తి- తిరుమల:** భక్తుల సౌకర్యార్థం డిసెంబర్ నెలకు సంబంధించి వర్చువల్ సేవకు సంబంధిత దర్శన టికెట్ల కోటాను టీటీడీ నవంబర్ 16న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఇందులో తిరుమల శ్రీవారి ఆలయంలో నిర్వహించే కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకార సేవలకు సంబంధించిన వర్చువల్ సేవ మరియు సంబంధిత దర్శన టికెట్లు ఉన్నాయి. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని కోరడమైనది.

# శశిధర్ మృతిపై న్యాయవిచారణ జరిపించండి

జెసికి వినతిపత్రం సమర్పించిన పాత్రికేయులు



**ప్రజాశక్తి- తిరుపతిటౌన్:** సీనియర్ జర్నలిస్ట్ బిఎం.శశిధర్‌ను గతనెల ఒక కేసులో పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షల అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరపరిచారు. శశిధరకు 15రోజుల రిమాండ్ విధించడంతో అతన్ని తిరుపతి సబ్‌జైలుకు తరలించారు. అయితే అప్పటికే పలు దీర్ఘకాలిక వ్యాధులు కలిగి ఉన్న వ్యక్తిని ఆసుపత్రికి తరలించాల్సింది పోయి రిమాండ్‌కు తరలించడంతో శశి ఆరోగ్యం క్షీణించడం మొదలైంది. 15 రోజుల తర్వాత రిమాండ్ పొడిగించడంతో చిత్తూరు సబ్‌జైలుకు తరలించారు. తీవ్రఒత్తిడికి గురైన శశిధర్ ఐదురోజులు పాటు పూర్తిగా ఆహారం తీసుకోవడం మానేశారు. ఈవిషయాన్ని జైలు అధికారులు పట్టించుకోలేదు దీంతో శశి ఆరోగ్యం మరింతగా క్షీణించి ఆయన పరిస్థితి విషమించడంతో తిరుపతి స్విమ్స్‌కు పంపించేశారు. సకాలంలో వైద్యం అందక చికిత్స ఆలస్యం అవ్వడంతో శశిధర్ శరీరం వైద్యానికి సహకరించడం లేదని స్విమ్స్ వైద్యులు తెలిపారు. నవంబర్ 8న శశిధర్ మతి చెందారు. ఈ మొత్తం పరిణామాలపై అయన అరెస్టు నుంచి మతి వరకు జరిగిన సంఘటనలపై న్యాయవిచారణ కోరుతూ పోలీసులు, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, జైలు అధికారుల పాత్రపై న్యాయ విచారణ జ్యుడీషియల్ ఎంక్వైరీ కోరుతూ తిరుపతికి చెందిన పలువురు పాత్రికేయులు సోమవారం జిల్లా సంయుక్త కలెక్టర్ బికె బాలాజీకి వినతిపత్రం అందించారు. జరిగిన అన్యాయాన్ని ఆయనకు వివరించారు. అన్ని విషయాలు సావధానంగా విన్న జాయింట్ కలెక్టర్ శశికి జరిగిన అన్యాయం మరెవరికి జరగనీయమబోమని.. హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ అందుబాటులోకి వచ్చిన వెంటనే వారితో సమావేశమై చర్చించి తప్పు చేసిన వారిపై వారి పాత్రపై న్యాయవిచారణ జరిపిస్తామని తెలిపారు మూడు, నాలుగు రోజుల్లోతో కలెక్టర్ మాట్లాడి పాత్రికేయులను పిలిపించి సమావేశం ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. సీనియర్ పాత్రికేయులు జి.శ్రీధర్ ఏబీఎన్ దినేష్ కె.గిరిబాబు వళిగలం గోపి, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి బాలచంద్ర జర్నలిస్టులు తులసి, రామ్, ఓంశేఖర్, మాచర్ల శ్రీనివాస్, వరప్రసాద్, చెంచయ్య, నటరాజ్, గిరిధర్, చరణ్, మూర్తి గురవారెడ్డి పాల్గొన్నారు.

### శశిధర్ మృతి పైన విచారణ జరిపించాలి:టిడిపి

సీనియర్ పాత్రికేయుడుగా గుర్తింపు పొందిన శశిధర్ అనే వ్యక్తి జుడిషియల్ కస్టడీలో అనుమానాస్పదంగా మతి చెందడంపై విచారణ జరిపించాలని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ విషయం గవర్నర్ దష్టికి తీసుకుపోతామని, మేజిస్ట్రియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## దేవరాజుల నాయుడును అభినందించిన విద్యాసాగర్



**ప్రజాశక్తి- తిరుపతి సిటీ :** వెటరన్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటిన ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాల క్యాంపస్ ఇంఛార్జి కె.దేవరాజుల నాయుడును ఆ కళాశాల డైరెక్టర్, సీఈఓ వై.విద్యాసాగర్ అభినందించారు. ఈనెల 11,12 తేదీలలో 42వ స్టేట్‌మాస్టర్స్ ఛాంపియన్షిప్ 2022ను విశాఖపట్టణం వెటరన్ అథ్లెటిక్స్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో 30ఏళ్లు పైబడిన స్త్రీ,పురుషులు పాల్గొన్నారు. ఈ పోటీలలో తిరుపతి జిల్లా నుంచి 12 మంది పాల్గొని 32 మెడల్స్ గెలుపొందారు. అందులో రిటైర్డ్ ఫైర్ ఆఫీసర్ ప్రస్తుత ఎన్ఆర్ఐ కళాశాల క్యాంపస్ ఇంఛార్జి కె.దేవరాజుల నాయుడు పాల్గొని రెండు గోల్డ్ మెడల్స్, ఒకటి సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నారు. కళాశాల సిఇఓ, డైరెక్టర్ విద్యాసాగర్ ఆయనకు పుష్పగుచ్ఛం అందించి దుశాలవాతో సత్కరించారు.

## స్మార్ట్ స్ట్రీట్ పనులు త్వరగా పూర్తి చేయండి : కమిషనర్

**ప్రజాశక్తి- తిరుపతిటౌన్:** స్మార్ట్ సిటీలో భాగంగా నగరంలో ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ స్ట్రీట్ పనులు త్వరగా పూర్తి చేయాలని కమిషనర్ అనుపమ అంజలి అధికారులను ఆదేశించారు. సోమవారం ఇంజినీరింగ్, అప్కాన్స్, ఏఈకామ్ అధికారులతో కలిసి శ్రీనివాస సేతు కు ఇరువైపులా చేస్తున్న స్మార్ట్ స్ట్రీట్ పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్మార్ట్ స్ట్రీట్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా ఫుట్ పాత్ లు ఇంకా పెండింగ్ ఉన్నాయని వాటిని పూర్తి చేయాలన్నారు. అలాగే శ్రీనివాస సేతు పిల్లర్ల మధ్యలో నాటిన మొక్కలను కత్తిరించి, మధ్యలో పూల మొక్కలు నాటాలన్నారు. ఏపుగా పెరిగిన మొక్కలను అందంగా ఉండేలా కత్తిరించి, పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లపైన ఎక్కడా నీరు నిలవకుండా డ్రైనేజీ కాలువలు నిర్మించాలన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికష్ణ, డి.ఈ.మోహన్, శానిటరి సూపర్ వైజర్ చెంచయ్య, అప్కాన్స్ స్వామి, ఏఈకామ్ ప్రతినిధులు ఉన్నారు



### చైల్డ్ లైన్ సే దోస్తీ వారోత్సవాలు

## వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాశక్తి- తిరుపతి సిటీ:**

బాలల దినోత్సవం సందర్భంగా అకాడమీ ఆఫ్ గాంధీయన్ స్టడీస్, రాష్ట్రీయ సేవ సమితి నిర్వహిస్తున్న 1098 చైల్డ్ లైన్ సే దోస్తీ వారోత్సవాల గోడ పత్రికలను జిల్లా ఎస్పీ పి.పరమేశ్వర రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బాలల రక్షణ- సంరక్షణకై చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే బాలల చట్టాలను పటిష్టంగా అమలు చేస్తామని, బాలల రక్షణకై చైల్డ్‌లైన్, వారికి తమ సహాయసహకారాలు అందిస్తామని, పిల్లలందరికీ చిల్డ్రన్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఇ.సుప్రజ, అడిషనల్ ఎస్పీ లా అండ్ ఆర్డర్ కులశేఖర్, డిఎస్పీలు దిశ రామరాజు, ఈస్ట్ మురళీకష్ణ, తిరుచానూరు సిఐ సుబ్రహ్మణ్యం, చైల్డ్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ జ్యోతి, కొల్లాబ్ కోఆర్డినేటర్ నాగమణి, సభ్యులు జయలక్ష్మి, సబిత, అరుణ, బాలకష్ణ, రాజేంద్ర పాల్గొన్నారు.

## ముక్కంటి సేవలో ప్రతిభా భారతి



**ప్రజాశక్తి- శ్రీకాళహస్తి :** మాజీస్పీకర్ ప్రతిభా భారతి సోమవారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వీరికి ఆలయాధికారులు సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. రాహు కేతు పూజలు చేసుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. తదనంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులు ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలి




**ప్రజాశక్తి - క్యాంపస్ :** విద్యార్థుల్లోని సృజనాత్మక ఆలోచనలను వెలికి తీసేందుకు ప్రస్తుతం నిర్వహిస్తున్న బయో కెమిస్ట్రీలోని వర్క్ షాప్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య కే రాజారెడ్డి అన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం బయో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల వర్క్‌షాప్ సోమవారం ఎస్వీయూ సెనెట్ హాల్లో ప్రారంభమైంది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్వీయూ పరిధిలోని విద్యార్థులకు మాలిక్యులర్ బయాలజీ, బయో కెమిస్ట్రీ అంశాలలో సరైన అవగాహన కలిగించడంలో వర్క్‌షాప్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ బెంగళూరుకు చెందిన ఆచార్యులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎమ్ఆర్ఎస్‌రావు, తిరుపతి ఐజర్ డీన్ డాక్టర్ రమేష్, వి.సొంటి, వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఓఎండీ హుస్సేన్, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.శ్రీనివాసులురెడ్డి, వర్క్ షాప్ కన్వీనర్ ఆచార్య ఎం.బాలాజీ, బయోకెమిస్ట్రీ విభాగాధిపతి ఆచార్య ఎస్‌డిఎస్ మూర్తి, సీనియర్ ఆచార్యులు ఆచార్య సిహెచ్ అప్పారావు, ఆచార్య ఓవీఎస్ రెడ్డి, విశ్రాంత ఆధ్యాపకులు ఆచార్య కె. త్యాగరాజు, డాక్టర్ కెవి.సరితారెడ్డి, పరిశోధకులు, అకడమిక్ కన్సల్టెంట్లు పాల్గొన్నారు.

## ప్రజాఫిర్యాదులు పెండింగ్‌లో పెట్టకండి : మేయర్

**ప్రజాశక్తి- తిరుపతి టౌన్:** స్పందన ఫిర్యాదులను, అదేవిధంగా డయల్ యువర్ కమిషనర్‌కి వచ్చే ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పరిష్కరించేలా చూడాలని మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి అధికారులను ఆదేశించారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమంలో మేయర్ కమిషనర్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ ఫిర్యాదులపై స్పందించిన మేయర్, కమిషనర్ సంబంధిత అధిజారులకు తగు ఆదేశాలు జారీ చేస్తూ, ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులపై స్పందించి తగుచర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, లోకేష్ వర్మ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికష్ణ, మేనేజర్ చిట్టిబాబు, డిఈలు విజయకుమార్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, సంజయ్ కుమార్, మహేష్, దేవిక, గోమతి, శానిటరి సూపర్ వైజర్ చెంచెయ్య పాల్గొన్నారు.

## దీక్ష తాత్కాలిక విరమణ

**ప్రజాశక్తి- తిరుపతి సిటీ:** తిరుపతి స్విమ్స్‌లోని నెఫ్రాప్లస్‌లో డయాలసిస్ పేషంట్‌ల సమస్యలను పరిష్కారాన్ని కోరుతూ డయాలసిస్ అసోసియేషన్ నాయకులు మునికుమార్ రాజ సోమవారం చేపట్టిన ఆమరణ నిరాహారదీక్ష తాత్కాలికంగా వాయిదా వేశారు. స్థానిక స్విమ్స్ ఆస్పత్రిలోనీ నెప్రోప్లస్ అధ్వర్యంలో ఉన్న డయాలసిస్ విభాగం ఎదురుగా మునికుమార్ రాజు డయాలసిస్ రోగుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం అమరణ నిరాహారా దీక్షకు కూర్చున్నారు. ఆయనకు పలువురు డయాలసిస్ రోగులు మద్దతు తెలిపారు. విషయం తెలుసుకున్న స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి సీనియర్ పాత్రికేయులు అక్కడికి చేరుకొని మునికుమార్ రాజకు నచ్చచెప్పారు. నెఫ్రోప్లస్ వారితో మాట్లాడి వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించాలని డాక్టర్ రామ్ హామీ ఇచ్చారు. దీంతో దీక్షను తాత్కాలికంగా విరమిస్తున్నామని, సమస్య పరిష్కారం కాకపోతే దీక్షని మళ్లీ ప్రారంభిస్తానని తెలిపారు.

## సమకాలీన అంశాలపై అవగాహన అవసరం

ప్రిన్సిపల్ డాక్టర్ టి.నారాయణమ్మ



ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు ఇతర సమకాలీన అంశాలపై కూడా సమగ్రమైన అవగాహనతో పట్టు సాధించాలని ఎస్వీఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.నారాయణమ్మ అన్నారు. శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో డిగ్రీ విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.8వేలు, రెండవ బహుమతిగా రూ.5వేలు, మూడో బహుమతిగా రూ.3 వేలు డిసెంబర్ 1వ తేదీన తిరుపతి జిల్లా కలెక్టర్ కె వెంకటరమణారెడ్డి ప్రదానం చేస్తారని వెల్లడించారు. రెడ్ రిబ్బన్ క్లబ్ కో-ఆర్డినేటర్ కిరణ్ కుమార్ రాజు, విజయశ్రీ, ఎయిడ్స్ నియంత్రణ యూనిట్ మేనేజర్ లలిత, మహేశ్వర్, ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ భీమన్న, భాస్కర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి



ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: మహిళలు కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని అంచె లంచెలుగా మహిళా పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఉమెన్ ఇన్నియేటివ్స్ (విన్స్) సంస్థ వ్యవస్థాపకురాలు మీరా అన్నారు. విన్స్ సంస్థ, రాస్, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం చెరువుముందరపల్లిలోని మహిళా రైతులకు హెర్బల్ ప్యాక్‌ల తయారీపై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా మీరా మాట్లాడుతూ ష్యాంపు, ఫేస్‌ప్యాక్, సబ్బులు తదితర నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేసి మార్కెట్లలో విక్రయించి ఆర్థికంగా.. సామాజికంగా మహిళా పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నారు. సంస్థ సిబ్బంది రహంతుల్లా, ఇందుప్రియ, కషి విజ్ఞాన కేంద్రం, రాస్ సంస్థ సిబ్బంది, సురబి రైతు ఉత్పత్తుల సంఘం మహిళా రైతులు పాల్గొన్నారు.

## డిజిటల్ అసిస్టెంట్లు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-బాలాయపల్లి : సచివాలయంలో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్లు అప్రమత్తంగా ఉండి సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో వినిల్‌కుమార్ తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయం డిజిటల్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పక్కాగహాలు మంజూరైన వారు వెంటనే పనులు ప్రారంభించుకోవాలన్నారు. అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందేలా ప్రత్యేక దష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో మండలశాఖ అధికారులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


## విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-రేణిగుంట: బాలల దినోత్సవం సందర్భంగా రేణిగుంట మండలం వెద్దలచెరువు గిరిజన కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జూలియన్ రాజు విద్యార్థులకు నోటు పుస్తకాలు, విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హరి, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, అంగనవాడీ కార్యకర్త గంగమ్మ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## తుపాను బాధితులకు అండగా ఉండాలి

ప్రజాశక్తి-బాలాయపల్లి: తుపాను బాధితులకు అండగా ఉండాలని తహశీల్దారు అజ్మీతులఖాన్ తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో తుపాన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలోని గిరిజన కాలనీలను సందర్శించి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. వర్షాల కారణంగా అంటు వ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీవో వినిల్‌కుమార్ మాట్లాడుతూ పారిశుద్ధ్య పనులు ప్రారంభించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి కళ్యాణ్‌చక్రవర్తి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా వడ్లతాంగల్ జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి, శ్రీకాళహస్తి రూరల్: ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, వైసీపీ సీనియర్ నేత వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం శ్రీకాళహస్తి మండలం టీఎంవీ కండ్రిగలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అభిమానులకు పంచి పెట్టారు. బాలాజీ ప్రసాద్ రెడ్డిని అభిమానులు దుశ్శాలువతో సన్మానించారు. ఇలాంటి జన్మదినాలు మరెన్నో జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు మునికృష్ణారెడ్డి, దొరబాబు, జయ, ఎల్లప్ప, దేవేంద్ర, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల వేధింపులు అరికట్టాలి

కరపత్రాలు విడుదల చేసిన సిఐటియు నాయకులు



ప్రజాశక్తి- గూడూరు: మున్సిపల్ కార్మికులపై మున్సిపల్ అధికారుల దాడులు అరికట్టాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. సోమ వారం పట్టణంలోని సి.ఐ.టి.యు. కార్యాలయంలో మున్సిపల్ కార్మికుల పలు సమస్యలపై కరపత్రం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి.గోపినాథ్, పట్టణ కార్యదర్శి దార కోటేశ్వరరావు, జిల్లా సభ్యులు బి.ప్రసాద్, బి.మురళి, బి.పెంచల ప్రసాద్, మహేంద్రా, పెంచలయ్య, శ్రీనివాసులు, వాసుదేవ, బాలాజీ,శాంతి వర్ధన్, రాఘవయ్య, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

## దుండగులను వెంటనే శిక్షించాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గుంటూరు జిల్లా పెద్దకాకాని మండలం ఉప్పలపాడు లోని నందమూరి తారక రామారావు విగ్రహానికి చెప్పులు దండ వేసి అవమాన పరిచిన వారిని కఠినంగా శిక్షించాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబూరు సింధూజ ఓ ప్రకటనలో డిమాండు చేశారు. చనిపోయిన వారి స్మారక విగ్రహాలపైనా రాజకీయ పైశాచిక ఆనందాలు, వెకిలి చేష్టలు సరికావని సూచించారు.

## శివయ్యకు బియ్యపు పిండితో అలంకరణ



ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని మంచినీళ్లగుంట కాశీ విశాలాక్షి సమేత శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామికి సోమవారం బియ్యపు పిండితో ఆలయ పూజారులు సూర్యనారాయణ శర్మ, మణిస్వామి అలంకరణ చేపట్టారు. ఉదయం నాలుగు గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ వార రుద్రాభిషేకం నిర్వహించారు.

# ఘనంగా బాలల దినోత్సవం..!



తిరుపతిలో..



క్యాంపస్‌లో..

ప్రజాశక్తి-తిరుపతి టౌన్, తిరుపతి సిటీ: వరదరాజునగర్, శ్రీపురం కాలనీలోని భాష్యం పాఠశాలలో సోమవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో జోనల్ ఇన్‌ఛార్జి లక్ష్మణ్, ప్రిన్సిపల్ బాలాజీ, లిటిల్ ఛాంప్స్ ఇన్‌ఛార్జి సుధాకుమారి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

**బి.యన్.కండ్రిగ:** మండలంలోని కళ్లివెట్టు, బిఎన్‌కండ్రిగ, నెలవాయి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో సోమవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జవహర్‌లాల్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణయ్య, విజయకుమారి, రాజశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**పాకాల:** పాకాలలోని బ్లోషం, దామలచెరువులోని శ్రీచైతన్య పాఠశాలల్లో సోమవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ మహేష్, హరినాథ్ రెడ్డి పాల్గొన్నారు. దామలచెరువు మ్యాంగో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలలో , పత్తిపాటివారిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.

**పుత్తూరు టౌన్:** పుత్తూరులోని ఎస్ఆర్ఎస్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం పిల్లలకు కథల పుస్తకాలు, తెలుగు-వెలుగు పుస్తకాలను ఉచితంగా అందించారు.

**తిరుమల:** తిరుపతిలోని ఎస్‌ఎన్‌పురం శ్రీచైతన్య పాఠశాలలో సోమవారం బాలల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక నత్య ప్రదర్శనలు అలరించాయి. ఏజీఎం సురేష్, ఆర్ఐ డాక్టర్ మోహన్‌బాబు, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**గూడూరు రూరల్:** గూడూరు రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా గాంధీనగర్‌లోని మినీ గురుకుల పాఠశాలలో సోమవారం విద్యార్థినులకు వ్యాసరచన, డ్రాయింగ్, పాటలు, నత్య, ఆటల పోటీలు నిర్వహించారు.



ఎస్‌ఎన్‌పురం శ్రీచైతన్య పాఠశాలలో..

**తిరుచానూరు:** తిరుచానూరులోని శాఖా గ్రంథాలయంలో సోమవారం బాలల దినోత్సవం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మధు బాల నెహ్రూ చిత్రపటానికి నివాళులు అర్పించారు. గ్రంథాలయాధికారి నాగరాణి పాల్గొన్నారు.

**దొరవారిసత్రం:** దొరవారిసత్రం మండల పరిధిలోని పూలతోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఘనంగా బాలల దినోత్సవ కార్యక్రమాన్ని జరుపుకున్నారు. ప్రధానోపాధ్యాయులు కష్ణయ్య, సేవ్ ది చిల్డ్రన్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

**బుచ్చినాయుడుకండ్రిగ:** స్థానిక బీసీ బాలుర వసతి గహంలో సోమవారం వార్డెన్ రామయ్య ఆధ్వర్యంలో బాలల దినోత్సవం జరిగింది. పిల్లలకు స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో వసతిగహ సిబ్బంది హైమావతి, సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

**నాగలాపురం:** భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని ఎస్.ఎస్.పురం ఉన్నత పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఇసుకలో నెహ్రూ శిల్పాన్ని రూపొందించి నివాళులు అర్పించారు. ఎంఈవో బాబయ్య, ప్రధానోపాధ్యాయులు పుష్ప తదితరులు పాల్గొన్నారు.

**కేవీబీపురం:** రాయపేడులోని ప్రభుత్వ పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు ఆటల పోటీలు చేపట్టారు.

**రేణిగుంట:** రెయిన్‌బో స్కూల్ లో సోమవారం ఘనంగా 'చిల్డ్రన్స్ డే' వేడుకలు ఘనంగా నిర్వహించారు. అలాగే గ్రంథాలయంలోనూ వేడుకలు జరిగాయి.

**శ్రీకాళహస్తి:** జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాలల్లో శ్రీకాళహస్తి సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. శ్రీ చైతన్య(పానగల్) ఇంగ్లీష్ మీడియం స్కూల్, విశ్వ భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో బాలల దినోత్సవ వేడుకలు జరిగాయి.

**గూడూరు:** రోటరీక్లబ్ ఆధ్వర్యంలో జి.యస్.ఆర్. మున్సిపల్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా జరిగింది.

**క్యాంపస్:** నేటి బాలలే రేపటి పౌరులని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆచార్య ఓఎండీ హుస్సేన్ అన్నారు. శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ పాఠశాలలో బాలల దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మహమ్మద్ హుస్సేన్, సీనియర్ తెలుగు అధ్యాపకులు అమ్మణ్ణి, ప్రధానోపాధ్యాయులు షకీనమ్మ, కె.వి రాజు తదితరులు పాల్గొన్నారు.

**తిరుపతి(మంగళం):** మంగళం పరిధిలోని ప్రభుత్వ బాలుర వసతిగృహంలో సోమవారం బాలల దినోత్సవాన్ని తిరుపతి రెండో జూనియర్ సివిల్ జడ్జి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. జాయింట్ డైరెక్టర్ ఆఫ్ కరెక్షనల్ సర్వీసెస్ విశ్రాంత అధికారి డాక్టర్ పి.సుకుమారన్, రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ జి. రంగారెడ్డి, జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులు ఎన్. మంజుల, నారాయణరెడ్డి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ కమిటీ సభ్యులు భువనేశ్వరి, రేవతి, అనసూయ, మహాలక్ష్మి, హెూమ్ సూపరింటెండెంట్ ఎం.షణ్ముఖరావు, ఐపీఓ లక్ష్మీపతి పాల్గొన్నారు.

**బైరాగిపట్టెడ పాఠశాలలో..** తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని బైరాగిపట్టెడలోని మహాత్మాగాంధీ నగరపాలక పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తూకివాకం శాలిని, మహేష్ రెడ్డి, అన్నమయ్య సర్కిల్ బ్రాంచ్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ కార్పొరేషన్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో మబ్బు సూర్యనారాయణ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

**పుత్తూరు టౌన్:** శాఖా గ్రంథాలయ 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా పుత్తూరులో గ్రంథాలయాధికారి ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు.

**తొట్టంబేడు:** ఉత్తమ నేస్తాలైన పుస్తకాలు చదివి విజ్ఞాన వంతులు అవ్వండని గ్రంథాలయాధికారి హరికృష్ణ అన్నారు. 55 జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన జాతీయ జెండాను ఎగురవేసి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి విద్యార్థిని, విద్యార్థులకు చాక్లెట్లు బిస్కెట్లు పంపిణీ చేశారు.

## అర్హులందరికీ సంక్షేమ ఫలాలు :ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజాశక్తి-బిఎన్‌కండ్రిగ: మండల కేంద్రంలోని గాజులపెళ్లూరు, నీర్పాకోట సుందరయ్య కాలనీలలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మండల కన్వీనర్ ఆరని విద్యానాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే ఆదిమూలం గడప గడపకు తిరుగుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా.. లేదా అని అడిగి తెలుసుకున్నారు. అర్హత కలిగి లబ్ధి పొందని వారుంటే వెంటనే సచివాలయాల్లో సంప్రదించాలని కోరారు. గాజులపెళ్లూరు ప్రాథమిక పాఠశాలలో జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాలల దినోత్సవ సందర్భంగా పిల్లలకు స్వీట్లు పంచిపెట్టారు. జవహర్‌లాల్ నెహ్రూ గొప్పతనాన్ని వివరించారు. తహశీల్దారు చంద్రశేఖర్‌నాయుడు, ఎంపీడీవో త్రివిక్రమ రావు, హౌసింగ్ ఏఈ సుబ్రహ్మణ్యం, విద్యుత్‌శాఖ ఏఈ పుణ్యకోటి, ఏపీఎం ఇందిరా, ఏపీవో భానుప్రియ, అగ్రికల్చర్ అధికారి భారతి, సచివాలయ సిబ్బంది, నాయకులు గురునాథం, హరి ప్రసాద్, ప్రసాద్, పాల్ రాజయ్య, హరినాథ్‌రెడ్డి, అజయ్ రెడ్డి, రమేష్ నాయుడు, గోపియాదవ్ పాల్గొన్నారు.

## పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు: డీఈవో



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తున్న డీఈవో శేఖర్

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని.. రాచపాళెం గ్రామంలో స్వయంకషి జనహిత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ వి.శేఖర్ అన్నారు. సోమవారం పాఠశాలలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కషి జనహిత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పదోతరగతి లో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందించారు. క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు బహుమతులు, ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వయంకషి జనహిత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి, డైట్ సీనియర్ లెక్చరర్ బి. చెంగల్రాజు, ఎంఈవో తిరుమలరాజు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు కన్నయ్య రాజు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ సుభాషిణి, స్వయంకషి సంస్థ కోశాధికారి విజయ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బుద్ధిమాంద్యం పిల్లలు దేవుని స్వరూపాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న భూమన్ దంపతులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): బుద్ధి మాంద్యంతో పుట్టిన పిల్లలు భగవంతుని స్వరూపాలతో సమానమని శ్వేతా డైరెక్టర్ భూమన్, శ్రీకష్ణదేవరాయ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి. కుసుమకుమారి అన్నారు. సోమవారం రామ్‌నగర్ క్వార్టర్స్ సమీపంలోని బ్లూమ్స్ లో మొదటి వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భూమాన్ మాట్లాడుతూ మానవుని పుట్టుక, ఎదుగుదల, వద్ధాప్యం, మరణం ఎవరికీ అంతుపట్టని విశిష్టమైన జీవన విధానమని శాస్త్రవేత్తలు గుర్తించారన్నారు. ఎస్కేయూ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.కుసుమకుమారి మాట్లాడుతూ నేటితరంలోని చాలామంది కన్న తల్లిదండ్రులను అనాథ ఆశ్రమాల్లో ఉంచుతూ జన్మనిచ్చిన వారికి శాపగ్రస్తులుగా తయారవుతున్నారన్నారు. లోపాలతో పుట్టిన చిన్నారులు, వారి తల్లిదండ్రులు పలు సమస్యలతో బాధపడుతూ ఉంటారని..అలాంటి వారికి ఈ బ్లూమ్స్ వేదికగా నిలిచిందని వారి సేవలను కొనియాడారు. బ్లూమ్స్ ఫౌండర్ డాక్టర్ కొండేటి మధుసూదన్‌రావు మాట్లాడుతూ తాము గత ఏడాది సంస్థను స్థాపించడం జరిగిందని, ఇందుకు ప్రధాన కారణం చిన్నారుల్లో నెలకొన్న లోపాలను గుర్తించి నయం చేయడం కోసమేనని తెలిపారు. బ్లూమ్స్ నిర్వహణలో కొండేటి తనూజ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉంటూ బుద్ధిమాంద్యం చిన్నారులతో నిత్యం గడపడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో తిరుపతి రోటరీక్లబ్ మాజీ అధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## జెడ్పిటిసి సభ్యురాలి వివాహ ఆహ్వానం

ప్రజాశక్తి -బాలాయపల్లి: తెలంగాణ రాష్ట్ర, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్ర కిరణ్ రెడ్డిని సోమవారం బాలాయపల్లి మండల జిల్లా పరిషత్ సభ్యురాలు సింగంశెట్టి అమర సాయి తన వివాహానికి హాజరుకావాలని సగౌరవంగా ఆహ్వాన పత్రికను అందజేసింది. మాజి ఎంపీపీ, వెంకటగిరి మార్కెట్ కమిటీ ఛైర్మన్ సింగంశెట్టి భాస్కరరావు మాట్లాడుతూ తన కుమార్తె వివాహానికి హాజరవి దీవించాలని కోరారు.

## నేటి నుంచి ఎల్‌సిడిసి ఇంటింటి సర్వే

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రామచంద్రాపురం మండలం కమ్మపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న గ్రామాలలో ఆశాలు, మగవాలంటీర్లతో కుష్టు వ్యాధి గ్రస్తులను గుర్తించే కార్యక్రమం ఎల్‌సిడిసిని నవంబర్ 15 నుండి డిసెంబర్ 5వ తేదీ వరకు నిర్వహించబడుతుందని పీహెచ్సీ వైద్యాధికారిని హేమలత ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

## ఏబీవీపీ కన్వీనర్‌గా తడుకు చందు



ప్రజాశక్తి-నాయుడుపేట: అఖిల భారత విద్యార్థి పరిషత్ విభాగంలోని నాయుడు పేట, ఓజిలి, పెళ్లకూర్ల మండలాల కన్వీనర్‌గా తడుకు చందును జిల్లా ఏబీవీపీ వ్యవస్థాపకులు దొరబాబు ప్రకటించారు. బాగ్ కన్వీనర్‌గా చందుని ఎన్నుకోవడాన్ని నగరం కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## అరుదైన చేప లభ్యం



ప్రజాశక్తి-బాలాయపల్లి: గూడూరు రూరల్ మండలం నెర్నూరు గ్రామానికి చెందిన చంద్ర సోమవారం చేపల వేటకు వెళ్లారు. ఈక్రమంలో ఓ వింతైన చేప దొరకడంతో అందరూ ఆశ్చర్యానికి గురయ్యారు. ఇలాంటి చేపను ఎన్నడూ చూడలేదని తెలిపారు.

## ఎర్రచందనం స్వాధీనం

10 మంది స్మగ్లర్ల అరెస్టు

ప్రజాశక్తి- యర్రావారిపాలెం: పోలీసులకు అందిన రహస్య సమాచార మేరకు సీఐ తులసీరామ్, ఎస్ఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి శనివారం మండలంలోని ఎల్లమంద క్రాస్ వద్ద తనిఖీలు నిర్వహించినట్లు విలేకరుల సమావేశంలో సిఐ తెలిపారు. ఈ తనిఖీలలో భాగంగా రెండు ఆటోలు, బైకు, ఆరు ఎర్రచందనం కొయ్యలను స్వాధీనం చేసుకుని, 10 మంది స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు తెలిపారు. పట్టుబడ్డ స్మగ్లర్లు 8 మంది తమిళనాడుకు చెందినవారుగా, మరో ఇద్దరు తిరుపతి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారిగా పోలీసులు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: మండలంలోని మేదరపల్లి గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై మహిళ మృతి చెందింది. స్థానికుల వివరాల మేరకు సోమవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో కావమ్మ (53)అనే మహిళ ఆవుల షెడ్డులో ఆవును కట్టేస్తున్న సమయంలో వర్షానికి బాగా తడిసిన రేకులకు కరెంటు సరఫరా కావడంతో ప్రమాదవశాత్తు ఆమెకు తగిలి అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది.ఈమె మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.వెంటనే విద్యుత్ అధికారులు దీనిపై పరిశీలించి మరమ్మతులు చేయాల్సిందిగా గ్రామస్తులు కోరుతున్నారు.

## మద్యం బాటిళ్ల స్వాధీనం

ఆటో సీజ్ - ఇద్దరి అరెస్ట్

ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట సెబ్ సీఐ ఆర్ యూ వి ఎస్. ప్రసాద్ తన సిబ్బంది, గూడూరు డిటిఎఫ్ సిబ్బందితో కలసి నాయుడుపేట పాత చెక్ పోస్ట్ వద్ద సోమవారం దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా ఏపీ 39 సి జీ 3386 నెంబర్ గల మహేంద్ర ఆల్ఫా ఆటోలో ప్రయాణిస్తున్న ఆటో డ్రైవర్ నామాల సుబ్రమణ్యం, దాసరి జయమ్మల వద్ద నుండి అక్రమంగా తరలిస్తున్న 21 (180ఎంఎల్) బాటిళ్లను స్వాధీనం చేసుకుని, ఆటోను సీజ్ చేసి వారిద్దరిని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. అరెస్ట్ చేసిన ఇద్దరు ముద్దాయిలను రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు.ఈ దాడులలో సెబ్ కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, తిరుమల రావు, వెంకటేశ్వర్లు, షరీఫ్‌లు పాల్గొన్నారు.

## 12 వేలకు 150 ఇళ్లేనా..! : జనసేన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వైయస్సార్, జగనన్న కాలనీల ద్వారా మొదట విడతలో 12 వేల ఇళ్ళు ఈ జూన్ నాటికి పూర్తి కావాల్సి ఉండగా కేవలం 150 ఇళ్లు మాత్రమే పూర్తి చేయడం నిజంగా సిగ్గుచేటని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినుత కోట విమర్శించారు. 'జగనన్న ఇల్లు- పేదలందరికీ కన్నీళ్లు' కార్యక్రమంలో భాగంగా సోమవారం జనసేన నాయకులు శ్రీకాళహస్తి గృహ నిర్మాణ శాఖ డీఈని కలిసి వినతి పత్రం అందజేశారు. జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలు పూర్తిస్థాయిలో ప్రారంభానికి నోచుకోకపోగా, అరకొరగా కడుతున్న ఇళ్లన్నీ నాసిరకంగానే ఉన్నాయని వినుత ఆరోపించారు. కాంట్రాక్టర్లు నిబంధనలకు నీళ్లొదిలి.. కాసులకు కక్కుర్తి పడుతున్నారనీ, జగనన్న కాలనీలో కనీస మౌలిక వసతులు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవన్నీ హౌసింగ్ శాఖధికారులే స్వయంగా ఒప్పుకుంటున్నారని కితాబిచ్చారు. రాఘవయ్య, గోపి, రవి కుమార్ రెడ్డి, మణికంఠ, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

## నివాసయోగ్యంగా లేని స్థలాల్లో పేదలకు పట్టాలు

ప్రజాశక్తి-గూడూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో నివాసయోగ్యంగా లేని స్థలాల్లో పేదలకు పట్టాలు ఇచ్చి లబ్ధిదారులను గృహాలు కట్టుకోమని రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకుందని జనసేన పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ రావు తీవ్రంగా విమర్శించారు. జగనన్న ఇల్లు పేదల కన్నీళ్లు కార్యక్రమంలో భాగంగా సోమవారం గూడూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో జనసేన పార్టీ నాయకులు పర్యటించి జగనన్న పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన లేఔట్లు పరిశీలించారు అనంతరం పలు సచివాలయాలను సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ఓంకార్, సాయి, శివ, మధు, విజయ్, వెంకటేష్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు .

**పుత్తూరుటౌన్:** జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయనిం జనసేన నాయకులు అన్నారు. సోమవారం పుత్తూరు మండలంలోని తడుకు పంచాయతి టీఆర్ కండ్రిగ ఎస్‌సి కాలనీలో జగనన్న కాలనీ తిడ్కో ఇల్లు ఆడిట్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డొక్కా సీతమ్మ పేరున ఎస్ సి కాలనీలో అన్నదానం, వస్త్రాదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపధ్యక్షుడు బత్తిన మధు బాబు, పుత్తూరు మండల అధ్యక్షులు వెంకట ముని, జగదీష్, కటికం నాగార్జున, దీలిప్, భాను, గోపి, గుణ, గజేంద్ర, రాజేష్, మురగయ్య పాల్గొన్నారు.

## ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికల ప్రదానం



ప్రజాశక్తి - క్యాంపస్: తిరుపతి స్థానిక పల్లివీధిలోని మునిసిపల్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 4వ తరగతి నుంచి 7వ తరగతి పిల్లలకు వక్తృత్వం, వ్యాస రచన పోటీలు నిర్వహించి అందులో ప్రతిభ చూపిన విద్యార్థులకు తరగతి వారీగా అతిథులచే జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. స్కూల్లోని సుమారు 170 మంది పిల్లలకు అల్పాహారం పంచిపెట్టారు. ఇలాంటి కార్యక్రమాలను నగరంలోని అన్ని మునిసిపల్ స్కూళ్ళల్లో నిర్వహించి పేద పిల్లలను ప్రోత్సాహంచే ప్రయత్నం నిరంతరం చేస్తామని ఆధార్ ఫౌండేషన్ అధ్యక్షులు షేక్ ముహమ్మద్ రఫీ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన 25వ డివిజన్ కార్పొరేటర్ కే. నరసింహాచారి మాట్లాడుతూ ఈ స్కూల్ ఈ ప్రాంతంలో ఏర్పడ్డానికి తాను కారణమైనందుకు సంతోషంగా ఉందన్నారు. ఇంకా మెరుగైన సదుపాయాలు కల్పనకు కృషి చేస్తున్నానని తెలిపారు. ముఖ్య అతిథి ప్రముఖ విద్యావేత్త, విశ్వం విద్యాసంస్థల అధినేత డా. ఎన్. విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ ఈ స్కూల్లోని ఉత్తమ విద్యార్థులకు తమ సంస్థ తరపున సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఉచితంగా కల్పిస్తామని పిల్లలను ఉత్సాహపరిచారు. శంకరంబాడీ సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలు డి.మస్తానమ్మ, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, అధ్యాపకులు లక్ష్మిదేవి, నిర్మలాబాయి, హిమబిందు, అంగన్వాడీ టీచర్ జయసుధ, స్కూల్ సహాయకులు గీతా, నవనీత, ఆధార్ ఫౌండేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఈ.కుప్పయ్య, కోశాధికారి షేక్ సాధిక్ అహ్మద్, నాయకులు సి. మధుసూధన్ రెడ్డి, షేక్ ఇస్మాయిల్, షేక్ షాహుల్, నికేష్, లీలానంద, సతీష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బెహన్ జీకి గరికపాటి క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: బీఎస్పీ అధినేత మాయావతికి ప్రముఖ ప్రవచనాల బోధకుడు గరికపాటి నరసింహ రావు బహిరంగ క్షమాపణలు చెప్పాలని జై భీమ్ ఆర్మీ వ్యవస్థాపకుడు పులి శ్రీకాంత్ సోమవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. మాయావతి ఒక దళిత మహిళ కాబట్టే గరికపాటి ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయగలిగారని మండిపడ్డారు. మరి వేరే అగ్రకులస్తులపై ఇటువంటి అనుచిత వ్యాఖ్యలు చేసే దమ్ము, ధైర్యం మీకుందా? అంటూ ప్రశ్నించారు. ఇటీవల మెగాస్టార్ చిరంజీవిని అవమానించి బహిరంగ క్షమాపణ చెప్పారని, మాయావతి విషయంలో కూడా క్షమాపణలు చెప్పకుంటే తగిన పర్యావసనాలు తప్పవని హెచ్చరించారు.